# 'నా పేరేమిటి?'

"చేస్తున్న ఇంతోటి ఉద్యోగానికీ వీడికింత పొగరా? ఓ మామూలు ప్రయివేటు బస్సుడ్రైవరుగాడికి ఇంత తలబిరుసా? వీడు నడుపుతున్నది కట్టుపాలెం బస్సనుకున్నాడా, లేకపోతే 'కనిష్కాజంబో జెట్' అనుకుంటున్నాడా? నా కొడుకు కారు చెడిపోయి చెయ్యి అడ్డుపెడితే, లిఫ్ట్ ఇవ్వడా? పైగా 'బ్రేకినస్పెక్టరు కొడుకయితే మనకేటి, బేవార్సునాకొడుకయితే మనకేటి?' దేవుడి కొడుకయినా సరే నేను ఎక్కించుకుని ఓవరులోడ్ చెయ్యనుగాక చెయ్యను' అంటూ నోటికొచ్చినట్లు వాగుతాడా? లాభంలేదు. వీణ్ణోపట్టుపట్టాలి! లేకపోతే ఈ అంటువ్యాధి మోటారు కులమంతా వ్యాపిస్తుంది."

బ్రేకినస్పెక్టర్ సుందర్రామూర్తి ఈ మాటలు ఎవరితోనూ అనలేదు. ఎందుకంటే కేవలం మాటలతోనే ఊరుకోవటం అతని పద్ధతికాదు. అందుకని చేతలేని మాటలు అందరి దగ్గరా అనడు. తనలో తాను ఓసారి అనుకోవడం, అవి ఆవడమూనూ, అంతే.

"కాఫీ తీసుకోండి"

భార్య చేతిలోంచి కాఫీ అందుకుని" చలపతీ! కేంపెళ్ళాలి! కారుబయటకు తియ్" అని కేకపెట్టాడు సుందర్రామ్మూర్తి.

"సాయంకాలానికి వచ్చేస్తారా?" అడిగింది ఇల్లాలు

"ఆహా మధ్యాహ్నానికే వచ్చేస్తాను" అంటూ "శ్రీనూ" అని కొడుకుని పిలిచాడు.

ఇరవై సంవత్సరాల శ్రీను తన గదిలోంచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ వచ్చేడు.

"నువ్వు నిన్న లిఫ్ట్ అడిగింది కట్టుపాలెం బస్సేకదా.... దాని డ్రైవరెవరన్నావు?"

"అవున్నాన్నా, డ్రైవరుపేరు బాబూరావట"

"అవునులే, బాబూరావే! వాణ్ణందరూ నిజాయితీ డ్రైవరంటారు. అయినా అంతపొగరా? వీడి సర్వీసులో ఎన్నడూ ఓవరులోడ్ చెయ్యలేదుగావును" కసిగా అని "సరేలే నువ్వెళ్ళు" అంటూ కాఫీ తాగటం ముగించి భార్యకు ఖాళీ కప్పు అందించేడు. గబగబా బయటకువచ్చి కారెక్కాడు.

ఉదయం ఎనిమిది గంటల లేత ఎండవేళ బ్రేకినస్పెక్టర్ సందర్రామ్మూర్తికారు బ్రేకుల్లేని కారులా అతివేగంగా మెయిన్‌రోడ్ మీంచి దూసుకుపోయి, కట్టుపాలెం బ్రాంచీరోడ్ మీదకు మళ్ళింది. ఎనిమిదీ నలభై! కట్టుపాలెం బస్సు టౌన్ నుండి రిటర్న్ అయ్యే టైమయింది. ఓ నాలుగు ఫర్లాంగులు ఎదరకు పోనిచ్చి "కారాపు చలపతీ" అన్నాడు సిగరెట్టు ముట్టిస్తూ.

"యస్సార్" అంటూ అతి వినయంగా తలాడించేడు డ్రైవరు. సరిగ్గా నాలుగో ఫర్లాంగు రాయిదగ్గర చెట్టు పక్కగా కారాగింది. సుందర్రామూర్తి ఈలోగా ఉచ్చుపన్నటానికి కావల్సిన సరంజామా అతా బ్రీఫ్‌కేసులోనుండి తీసి, కోటు జేబులో పెట్టుకున్నాడు. ఓ

స్టాప్‌వాచీ, కాగితం, పెన్నుచాలు! ఓవర్‌లోడ్ అక్కరలేదు. ఓవర్‌స్పీడ్ చాలు, కేసురాయటానికి అదైతే ఏకాఏకిని డ్రైవరే ఇరుక్కుంటాడు!

డోర్ తెరచి కారుదిగేడు.

"నువ్వలా కారులో వెళ్ళిపోయి మూడో ఫర్లాంగు రాయి దగ్గర వుండు చలపతీ! ఇంకో అయిదు పది నిమిషాలలో బస్సురావాలి. ఏది? కట్టుపాలెం బస్సన్నమాట, బాబూరావుగాడు డ్రైవరు. దాన్ని ఆపు. ఈలోగా నేను స్టాప్‌వాచీతో రీడింగు తీసుకుంటాను. తీసుకున్నాక నేను నడిచి వస్తానులే. నువ్వక్కడేవుండు కారుతో" అంటూ తన డ్రైవర్‌కి వివరంగా చెప్పేడు సుందర్రామ్మూర్తి.

కారు స్టార్ట్‌చేసి "అలాగే సార్" అంటూ రివర్స్ చేసుకుని మూడో ఫర్లాంగురాయి దగ్గరకు వెళ్ళిపోయాడు చలపతి.

సుందర్రామ్మూర్తి చెట్టుచాటుకు వెళ్ళి సిగరెట్టు ముట్టించి బస్సుకోసం ఎదురుచూస్తున్నాడు. ఎప్పుడో ఓసారి చూసేడు సుందర్రామూర్తి బాబూరావుని. అయినా స్పష్టంగా గుర్తున్నాడువాడు. ఇరవై అయిదు దాటుంటుంది వయసు, అయినా బక్కగా, ఎదిగీ ఎదగని తండ్రికీ, తెలిసీతెలియని మనసుగల తల్లికి పుట్టినట్టుంటాడు.

'నిజాయితీ డ్రైవర్, మైఫుట్! నిజాయితీ ఒక్కటేనా కావలిసింది, మంచితనం, సదుపాయం, వాటిమాటేమిటో.... బాస్టర్డ్! ఓ చురక తగిలిస్తేకాని దార్నిపడడు...'

ఈ ఆలోచనలతో రెండో సిగరెట్ అయిపోయే వేళకి, దూరంగా దుమ్మురేపుకుంటూ వస్తున్న కట్టుపాలెం బస్సు కనబడింది. దుమ్ముక్కారణం స్పీడుకాదు. రోడ్డుమీద దుమ్ము విపరీతంగా పేరుకు పోవడమే. ప్రస్తుతం ఓవర్‌స్పీడు కేసే బెస్టు. అయిదో ఫర్లాంగు రాయిదగ్గరకు రాగానే స్టాప్‌వాచ్ ఆన్‌చేశాడు. కొద్దిసెకన్లలోనే తాను దాగి వున్న చెట్టు ముందరి నాలుగో ఫర్లాంగురాయిని దాటుకుని ముందుకు దూసుకుపోయింది బస్సు. బాబూరావే నడుపుతున్నాడు.

చెట్టుచాటు నుండి రోడ్డు మీదకు వచ్చి స్టాప్‌వాచ్ చూశాడు సుందర్రామ్మూర్తి.. బస్సుస్లోగానే వెళ్తోంది.. నోటితో లెక్కకడితే ముప్ఫయిమైళ్ళు, కాగితం మీద లెక్కకడితే ముప్ఫయి మూడుమైళ్ళు స్పీడు తేలింది. స్టాపువాచీ ఆన్‌చేసి, డెబ్భయి మైళ్ళ స్పీడు లెక్కని వచ్చేటట్లు ముల్లు దిద్దేశాడు. స్టాప్‌వాచీ చేత్తో పట్టుకుని తాపీగా ముందువైపుకు మూడున్నర నిమిషాలు నడిచేడు సుందర్రామ్మూర్తి.

అంతసేపూ, అవతల ఫర్లాంగు దూరంలో రోడ్డుమీద జరుగుతున్న తతంగం కనిపిస్తూనే వుంది. తాను గమనిస్తున్నట్లు తెలియకుండా, హుందాగా ఇటూ అటూ తల ఆడిస్తూ వ్యవహారమంతా నడుస్తూనే పరికించి చూస్తున్నాడు సుందర్రామ్మూర్తి.

చెయ్యి అడ్డుపెట్టినవాడు ఇన్‌స్పెక్టర్‌గారి డ్రైవరనీ, రోడ్డుప్రక్కనే ఆపివున్న కారు కూడా ఆయనదేననీ తెలిసిందికనుక బస్సు ఆగింది. కండక్టరు మెడలోని కేష్‌సంచీ

సవరించుకుంటూ హడావుడిగా బస్సు దిగేడు. చలపతితో ఏదో మాట్లాడి, వెనక్కు తిరిగి గబగబా తనవంకే రావటం గమనించేడు సుందర్రామ్మూర్తి! ప్రయాణీకులు ఒకరొకరుగా బస్సుదిగి పోతున్నారు. బస్సు నడుస్తున్నప్పుడు అగ్గిపుల్లలు గియ్యటం రానివాళ్ళు ఇపుడాపని చేసి సిగరొత్తులు అగరొత్తుల్లా వెలిగిస్తున్నారు! రోడ్డువారకు వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు కొంతమంది. చేతులూ కాళ్ళూ బారచాపి విరుచుకుంటూ బద్ధకాలు తీర్చుకుంటున్నారు మరికొందరు.

దూరాన్నుంచే చేయెత్తి నమస్కారం పెట్టేడు కండక్టరు. నమస్కారానికి ఎత్తిన అతని చేతుల్లో 'ట్రిప్‌షీట్లు' వున్నాయి. సుందర్రామ్మూర్తి ప్రతి నమస్కారం చెయ్యలేదు. చెయ్యాల్సిన అవసరంలేదని తెలుసు. మరో నిమిషంలో సుందర్రామ్మూర్తి బస్సుకు చేరువయ్యాడు. దగ్గర కొచ్చేక మరోసారి నమస్కారం చేసిన కండెక్టర్‌కి 'స్వీకరించాంలే' అన్నట్లు తాలాడించేడు సుందర్రామ్మూర్తి.

"మీ డ్రైవరుగారు సీటు దిగలేమిటి?"

"డ్రైవరాసార్! ఎందుకు దిగడండీ... రేడియేటర్‌కి నీళ్ళు పోస్తున్నట్లున్నాడు. చిటికెలో తీసుకువస్తాన్‌సార్" అంటూ కండక్టరు బస్సు ముందువైపుకు పరుగెత్తేడు.

సుందర్రామ్మూర్తి తన కారు చేరుకుని బేక్ డోరు తెరిచి సీట్లో వెనక్కి చేరగిలబడి ఆశీనుడయ్యాడు, నడిచిన అలసట తీర్చుకుంటూ.

ఇంకో నిమిషంలో కండక్టరు, డ్రైవరు కారుదగ్గరకొచ్చేరు.

బాబూరావునడిచివస్తున్న గడ్డపారలా వున్నాడు! అమాయకమయిన ముఖం, కనుల వెనుక పట్టుదల, అతడిని చూసిన వారెవరయినా ఇవి రెండూ గుర్తిస్తారు. దగ్గర కొచ్చిన బాబూరావ్ మౌనంగా నిలబడ్డాడు నమస్కారం చేసి. కండక్టరు చేతులు కట్టుకుని ఎటెన్షన్‌లో నిలబడ్డాడు.

"నీ పేరేమిటి?" పేరు తెలిసినా, కఠినంగా అడిగేడు సుందర్రామ్మూర్తి.

"బాబూరావు"

"ఈ రోడ్డులో బస్సు ఎంత స్పీడులో నడపాలి?"

"అరవై మైళ్ళు దాటకూడదండి"

"మరి, నువ్వేస్పీడులో నడుపుతున్నావ్" కఠినంగా అడిగేడు.

"సుమారు ముప్ఫయి అయిదు, నలభై మధ్యనండి"

"ఊ... నోటితో చెప్పేస్తున్నావా? బస్సు స్పీడో మీటరు పనిచేస్తోందా?"

"స్పీడో మీటరు పనిచేస్తోందండి ఈ రోడ్డు మీద నలభై కంటేఎక్కువ తొక్కలేమండి, తొక్కితే బస్సు తూలిపడుతుంది. పైన వేసిన బుట్టలు, కోళ్ళగంపలుకిందికి పడిపోతాయండి. అంతా మట్టిరోడ్డు కదా"

"నేను స్టాప్‌వాచ్‌తో రికార్డు చేశాను. ఇదిగో కాగితం.... నువ్వు డెబ్బయిమైళ్ళ స్పీడుతో వస్తున్నావు"

"లేదండి! నలభై మైళ్ళలోపే వుంటుందండీ" బాబూరావు ఖచ్చితంగా చెప్పేడు.

"లేదుసార్! అసలే రోడ్డంతా గతుకులమయం, మట్టిరోడ్డు చాలా మెల్లగా వస్తున్నాం. మీరలా అంటే ఇంకేం మాట్లాడగలంసార్, ఈసారికి దయతలచండి" అంటూ బ్రతిమిలాడుతున్నాడు కండక్టర్.

సుందర్రామ్మూర్తి డ్రైవరువంక చూశాడు. అతడునిశ్చలంగా నిలబడి వున్నాడు. ముఖకవళికల్లో ఏమార్పులేదు. కనీసం తన వంక ప్రాధేయపూర్వకంగానయినా చూడటంలేదు. అంత అమాయకమయిన ముఖంలోనూ పట్టుదల కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

"నేనేం చెయ్యలేను. ఓవరు స్పీడు కేసురాస్తున్నాను" అంటూ కాగితాలు తీసి అట్ట ఒత్తుపెట్టి రాయటం ప్రారంభించేడు.

"సార్! సార్! ఈసారికి... " అంటూ అడ్డుతగలబోయాడు కండక్టరు.

"నువ్వేమిట్రా మధ్యన? ఈ కేసు వాడిక్కానీ నీక్కాదు" అంటూ గయ్యిమన్నాడు సుందర్రామ్మూర్తి.

కండక్టరు డ్రైవరువంక చూశాడు. బాబూరావులో ఏం చలనంలేదు.

"అయ్యగారి కాళ్ళమీద పడరా! ఈసారికి ఒగ్గేస్తారు" అన్నాడు కండక్టరు.

"నేను నలభై మైళ్ళస్పీడు కంటే ఎక్కువ స్పీడులో నడపలేదు" నాకా సంగతి తెలుసు" అన్నాడు బాబూరావు దృఢంగా. తర్వాత కొంచెం గొంతు తగ్గించి "ఆయన నన్ను బుక్ చెయ్యాలనే పట్టుదలతో వచ్చాడు. తెలీడంలేదూ?" అన్నాడు కండక్టరుతో.

తేలిగ్గా నవ్వేడు సుందర్రామ్మూర్తి. "ఊ... కమెలాంగ్... పేరు బాబూరావు.... పూర్తిపేరుచెప్పు" అని డిమాండ్ చేశాడు.

"పి. బాబూరావు"

"తండ్రిపేరు?"

"తెలీదు"

కోపంగా చూసేడు సుందర్రామ్మూర్తి "నీ తండ్రి పేరు నీకు తెలీదా?"

"తెలీదు"

"పోనీ తల్లిపేరు?"

"రాజరత్నం"

"రాజరత్నమా?" అని ఓ క్షణం అగి "చిరునామా" అంటూ అడిగేడు.

"బోగంవీధి, పెద్దాపురం"

వెన్నుమీద ఎవరో చరిచినట్లయింది సుందర్రామ్మూర్తికి.

బోగంవీధి.. పెద్దాపురం... రాజరత్నం!!

స్మృతిపథంలో పాతికేళ్ళ క్రితంనాటి సంగతులు అలవోకగా కదిలేయి. అవును!

బాబూరావు ముఖం ఎక్కడో చూసినట్లనిపించింది. వీడునూటికి నూరుపాళ్ళు రాజరత్నం పోలికే. వీడి నిజాయితీ కూడా వీడికి ఆమెనుండి సంక్రమించిందే! ఎంత నిర్మలమైన మనసు ఆమెది. భోగం మనిషి అయితే నేం? ఆరోజుల్లో ఆమెకు ఎంత పేరుండేది? ఎంత మంది యువకులు ఆమె పొందుకోసం తహతహలాడేవాళ్ళో ఆరోజుల్లో.

ఆ రాజరత్నం కొడుకా వీడు!!

తనలోని తొట్రుపాటును బయటపడనీయకుండా "నీ తండ్రిపేరు చెప్పాలి" తప్పదన్నట్లు అడిగేడుమళ్ళీ.

"నేను భోగంకులంలో పుట్టాను. మా అమ్మ పడుపువృత్తితో బతుకుతూ నన్ను పెంచి పెద్ద చేసింది. నా తండ్రి ఎవరో చెప్పలేను" నిశ్చలంగా, నిజాయితీగా ధ్వనించింది బాబూరావు గొంతు.

చుట్టూచేరిన ప్రయాణీకులు అప్పుడే వింతగా చూస్తున్నారు జరిగే వ్యవహారమంతా

"ఎవరో ఒకరిపేరు చెప్పాలి. లేకపోతే కేసు ఎలారాయాలి?" అంటూ ఎగతాళిగా నవ్వేడు సుందర్రామ్మూర్తి. ప్రయాణీకులు ఆ నవ్వు ఆధారంగా తేలిగ్గా ఊసులాడుకుంటున్నారు. సుందర్రామ్మూర్తి మనసులో కసితీరుతోంది.

బాబూరావు ముఖ కవళికలు మారిపోతున్నాయి. రెండు నిమిషాలు పోతే, ఏడవటానికి సిద్ధమయ్యేలా వున్నాడతను. సుందర్రామ్మూర్తి అతడి వంకే గుచ్చిగుచ్చి చూస్తూ మూడోసారి అడిగేడు

"నీ తండ్రి పేరుఏమిటని అడుగుతున్నానా? ఇందులో రాయాలి ఏదో ఒకటి చెప్పు" కాస్త స్వరం పెంచి మరీ అడిగి, తర్వాత వికృతంగా నవ్వేడు.

బాబూరావు రెండు క్షణాలు ఆగి "ఏదో ఒకటి చెప్పాలంటే ఏంచెయ్యను? పోనీ, తమరిపేరు రాసుకోండి" అంటూ అరిచినట్లే చెప్పి విసవిసా నడుచుకుంటూ బస్సువైపుకు కదిలిపోయాడు.

సుందర్రామ్మూర్తికి మతిపోయినంత పనయింది.

రాజరత్నం అమాయకురాలు, మర్యాదస్తురాలు, మరి ఈ పొగరెక్కడిది, వీడికి?

"లెటజ్ గో బేక్ చలపతీ" అన్నాడు చేతిలోని కాగితాలు చింపేస్తూ. రివర్స్‌గేర్ వేసినప్పటి దుమ్ము అతని తలనిండా పూసుకుంది!!!

★

(ఆంధ్రపత్రిక వీక్లీ 1986)